ప్రజాశక్తి

గురువారం 4 ఏప్రిల్ 2024 5 విజయనగరం



పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పలు ప్రాంతాలకు గురువారం ఉదయం 7.30గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ పి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. విటి అగ్రహారంలోని 132 కెవి సబ్ స్టేషన్‌లో విద్యుత్‌లైనులు మరమ్మతుల తోటపాలెం, ఆర్టీసి కాంప్లెక్స్ ఏరియా, ధర్మపురి, ఎస్‌వి యన్ నగర్, జమ్ము నారాయణపురం, సింగపూర్ సిటీ, రింగ్ రోడ్ ఏరియా, దాసన్నపేటలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



బొబ్బిలి, విజయనగరంలో పింఛన్ల కోసం వేచి చూస్తున్న వృద్ధులు, వికలాంగులు

పింఛన్ల కోసం పడిగాపులు

- రెండురోజులు ఆలస్యంగా పంపిణీ
- సచివాలయ సిబ్బంది చేతుల మీదుగా అందజేత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రెండు రోజులు ఆలస్యంగా పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది చేతుల మీదుగా బుధవారం మధ్యాహ్నం నుంచి లబ్ధిదారులకు అందజేశారు. అకౌంట్లకు నగదు ఆలస్యంగా పడినందున పంపిణీలో జాప్యం జరిగిందని సచివాలయ సిబ్బంది తెలిపారు. 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్టుగా ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. విజయనగరం జిల్లా కలెక్టర్ 4వ తేదీన పంపిణీ చేస్తామని ప్రకటించినప్పటికీ రాష్ట్ర స్థాయిలో వచ్చిన ప్రకటన ప్రకారం 3వ తేదీనే అందుతాయని ఆశపడ్డారు. ఇదే ఆశతో ఉదయం నుంచీ వృద్ధులు, వికలాంగులు, ఒంటిరి మహిళలు ఇలా అనేక కేటగిరీలకు చెందిన పింఛను దారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. మండుటెండలో తీవ్ర అవస్థలు పడ్డారు. వేపాడ మండలం సింగరాయి, వల్లంపూడితోపాటు, విజయనగంలోని విటి అగ్రహారం, మెరకముడిదాం మండలం గర్భాం సహా ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో అనేక చోట్ల ఇదే పరిస్థితి ఎదురైంది. మధ్యాహ్నం వరకు సంబంధిత సచివాలయ అకౌంట్లలో నగదు జమకాలేదు. అనంతరం అకౌంట్లలో జమ అయినట్టు మెసేజ్‌లు రావడంతో సంబంధిత బాధ్యులు హుటాహుటిన బ్యాంకులకు వెళ్లి నగదు తెచ్చారు. అనంతరం లబ్దిదారుల బయోమెట్రిక్ తీసుకుని సచివాలయ సిబ్బంది నగదు పంపిణీ చేశారు. కేవలం సచివాలయాలలోనే కాకుండా, కొన్నిచోట్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. సమయం సరిపోకపోవడంతో మిగిలిన వారికి రేపు ఇస్తామంటూ చాలా చోట్ల సిబ్బంది చెప్పారు.

విజయనగరం జిల్లాలో 2,83,773 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరిలో అత్యధికంగా వృద్ధులు 1,47,874 మంది ఉన్నారు. ఆ తరువాత స్థానంలో వితంతువులు 65,971 మంది, వికలాంగులు 37,840మంది, వైఎస్ఆర్ అభయ హస్తం పింఛనుదారులు 10,848 మంది ఉన్నారు. మిగిలిన వారిలో కళాకారులు, చేనేత, మత్స్యకార, ట్రాన్స్ జెండర్, దీర్ఘకాలిక రోగులు ఉన్నారు. వీరందరికి నెలనెలా సుమారు రూ.82కోట్ల 93లక్షల 99వేలు జిల్లా గ్రామీణాభివృద్ధి ద్వారా సామాజిక పింఛన్ల కింద అందుతోంది. ఈ మొత్తాన్ని సచివాలయాల పరిధిలోని వాలంటీర్ల ద్వారా పంపిణీ చేసేవారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల పనుల నుంచి వాలంటీర్లను మినహాయించాలని ఎన్నికల సంఘం సూచించిన సంగతి తెలిసిందే. చివరకు న్యాయ స్థానం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఈనేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నందున వాలంటీర్లతో పింఛన్లు పంపిణీ పట్ల టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అభ్యంతరం తెలిపిన సంగతి తెలిసిందే. దీనికి ప్రత్యామ్నాయంగా సచివాలయ సిబ్బందితో పంపిణీ చేపట్టాలని న్యాయ స్థానం సూచించింది. దీంతో, చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేయనీయకుండా అడ్డుకుంటున్నారంటూ సిఎం జగన్ సహా వైసిపి నాయకులు విమర్శలు చేశారు. అందుకు తగ్గట్టే రాష్ట్ర స్థాయి అధికారులు మునుపెన్నడూ లేని విధంగా రెండు రోజులు ఆలస్యంగా సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. దీంతో, ఆ మేరకు ఆలస్యంగానే పింఛన్ల పంపిణీ మొదలైంది.

వేపాడ మండలంలో చాలా మంది ఉదయం 9 గంటలకే పలుచోట్ల సచివాలయాల వద్దకు చేరుకున్నారు. కార్యాలయం సిబ్బంది 10గంటల తరువాత వచ్చి బ్యాంకు నుంచి అమౌంట్ రాలేదని, గురువారం ఇస్తామని చెప్పడంతో వారంతా నిరాశతో వెనుదిరిగారు.

విజయనగరంలోని విటి అగ్రహారం సచివాలయంలో వృద్ధులు, వికలాంగులు పింఛను కోసం పడిగాపులు కాశారు. సాయంత్రం సిబ్బంది పింఛను పంపిణీ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. మెరకముడిదాం మండలం గర్భాంలో సాయంత్రం నుంచి పింఛను పంపిణీకి చర్యలు చేపట్టగా సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

బొబ్బిలి మున్సిపాలిటీలో 16 సచివాలయాలు ఉన్నాయి. మున్సిపాలిటీలో 6248 మందికి పింఛన్లు అందుతున్నాయి. వీరంతా బుధవారం పింఛన్లు కోసం సచివాలయాలు వద్ద పడిగాపులు కాశారు. యాక్సిస్ బ్యాంకులో నగదు విత్ డ్రా చేసేందుకు వెళ్లిన సచివాలయ సంక్షేమ కార్యదర్శులు కూడా నగదు కోసం పడిగాపులు కాశారు. బ్యాంకులో నగదు లేకపోవడంతో పింఛన్ల సొమ్ము సచివాలయ ఉద్యోగులకు ఇవ్వలేదు. సాయంత్రం 6గంటల సమయంలో బ్యాంకు అధికారులు పెన్షన్ సొమ్ము ఇవ్వడంతో సచివాలయ ఉద్యోగులు పెన్షన్లు పంపిణీ ప్రారంభించారు.

యథేచ్ఛగా తాగునీటి వ్యాపారం

- పుట్టగొడుగుల్లా అనుమతులు లేని వాటర్ ప్లాంట్లు
- శుభ్రతలేని కేన్లలోనే విక్రయాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో మినరల్ వాటర్ పేరుతో నాణ్యతా ప్రమాణాలు లేని ప్యాకేజి డ్రింకింగ్ వాటర్ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వేసవి ప్రారంభం కావడంతో నీటి వ్యాపారం మరింత జోరందుకుంది. అత్యధిక మంది వ్యాపారులు బోరు నీటినే క్యాన్లలో నింపి విక్రయిస్తున్నారు. కలుషిత జలాలను సరఫరా చేస్తున్నారు.

జిల్లాలోని పట్టణ కేంద్రాల్లో ఎక్కువ కుటుంబాలు క్యాన్లలో మినరల్ నీటినే వినియోగిస్తున్నారు. జిల్లా ప్రజలంతా కలిపి నీటి కోసం సుమారు ఏడాదికి రూ.10 నుంచి 15 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు అంచనా. దీంతో పట్టణాల్లో, గ్రామాల్లో పుట్టగొడుగుల్లా నీటిశుద్ధి కేంద్రాలను (వాటర్‌ప్లాంట్లు) ఏర్పాటు చేస్తున్నారు. యజమానులకు ఒక్కో 20 లీటర్ల క్యాన్ నీటి తయారీకి రవాణా ఖర్చులతో కలిపి రూ.6 కంటే ఎక్కువ కావడం లేదు. వినియోగదారులకు మాత్రం రూ.10 నుంచి రూ.20వరకు విక్రయిస్తూ దోచుకుంటున్నారు. 200 మిల్లీలీటరక్ల వాటర్ ప్యాకెట్లు తయారుచేసి రూ.2 చొప్పున విక్రయిస్తున్నారు. వీటి పై తయారీ తేదీని, కాలం చెల్లిన తేదీని ముద్రించట్లేదు.

కొన్నింటికే అనుమతులు

జిల్లాలో సుమారు 600కి పైగా ఆర్ఒ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో పదుల సంఖ్యలో ప్లాంట్లకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. సాధారణంగా ఐఎస్ఐ ప్రమాణాలతో నీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయాలంటే రూ.35 లక్షల నుంచి రూ.50లక్షల వరకు పెట్టుబడి కావాలి. జిల్లా పరిశ్రమల శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నుంచి అనుమతులు ఉండాలి. కాని జిల్లాలో చాలా మంది రూ.3లక్షల పెట్టుబడి పెట్టి వివిధ సంస్థల పేరుతో అనధికారికంగా నీటిశుద్ధి ప్లాంటు ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు. కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తూ.. కేవలం బోరువాటర్ ను క్లోరినేషన్ ప్రక్రియ చేసి వడపోసి క్యాన్లలో నింపుతున్నారు. మరికొన్ని ఆర్ఒ ప్లాంట్లలో కనీసం వడపోత కూడా లేకుండా బోర్లు, మున్సిపాలిటీ కుళాయి నీటిని క్యాన్లలో నింపి విక్రయిస్తున్నారు.



కేన్లలో తాగునీటిని తరలిస్తున్న నిర్వాహకులు

ఈ నిబంధనలు తప్పనిసరి

ఆర్ ప్లాంట్లలో ముందుగా నీటిని క్లోరినేషన్ చేయాలి. తర్వాత ప్రత్యేకమైన శాండ్ ఫిల్టర్ ద్వారా వడపోయాలి. ఆపై కార్బన్ ఫిల్టర్స్, మైక్రాన్ ఫిల్టర్స్ శుభ్రం చేసి మరో కంపార్టుమెంటులోకి పంపాలి. ఆఖరి దశలో ఆక్సిజన్‌ను పంపి ఆక్సీకరణ చేయాలి. ఈ దశలో మినరల్స్‌ను జతచేయాలి. కాని ఆర్ఓ ప్లాంట్లలో ఈ దిశగా నీటిని శుద్ధి చేయడం లేదు. ఐఎస్ఐ ప్రమాణాలతో నడిచే ఆర్ ఒ ప్లాంట్లు జిల్లాలో నాలుగు మాత్రమే ఉన్నట్లు తెలుస్తుంది. నీటిశుద్ధి కర్మాగారాలపై తరుచూ తనిఖీలు నిర్వహించి నాణ్యతా ప్రమాణాలు పరీక్షించాల్సి ఉన్నా ఇంతవరకు ఒక్క ప్లాంటు పైకూడా తనిఖీలు లేవు. ఆహార తనిఖీ విభాగం, ఫుడ్ ఇన్స్పెక్టర్లు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు వీటి వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు. దీంతో కలుషిత నీటి వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. మినరల్ పేరుతో కలుషిత జలాలను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'కాళ్ల'కు తగిన మూల్యం తప్పదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిపై కాళ్ల గౌరీశంకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరానిదని వైసిపి నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ కంటుభుక్త తవిటి రాజు, నాగవంశం డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, కనకల కృష్ణ మాట్లాడారు. విశ్వసనీయత లేని కాళ్ళ గౌరీ శంకర్ మాటలను ప్రజలు నమ్మరని అన్నారు. ప్రజాసేవే పరమార్థంగా నిరంతరం కృషి చేస్తున్న వీరభద్ర స్వామి లాంటి వ్యక్తిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న గౌరీ దిగజారుడుతనాన్ని చూసి సిగ్గుపడుతున్నామన్నారు. ఎన్నికల సమయంలోనే ఇటువంటి కుయుక్తులకు పాల్పడడం గౌరీశంకర్‌కు అలవాటేనని అన్నారు. కేవలం తన ఉనికిని కాపాడుకునేందుకే ఇతర పార్టీల చెంతన చేరి కోలగట్లపై విమర్శలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. అర్బన్ బ్యాంకులో డమ్మీ మీటింగులు పెట్టి బ్యాంకును కొల్లగొట్టిన వైనం అందరికీ తెలిసిందేనని అన్నారు. మావేశంలో కార్పొరేటర్ కనకల నాగవల్లి, అవనాపు రాజు, కాళ్ళ సూరిబాబు, బేరి సత్యనారాయణ, కనకలగిరి, మహేష్, రామ్ సింగ్ ప్రసాదు, మొకర సతీష్, సురాల కృష్ణ, బుగత జయరాం తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులను కించపరిచేలా మాట్లాడొద్దు

- పిల్లలను ఎన్నికల కార్యక్రమాల్లో వినియోగించకూడదు
- రాజకీయ పార్టీల సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో విభిన్న ప్రతిభా వంతులను కించపరిచే పదాలను వాడవద్దని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. కుంటి ప్రభుత్వం, గుడ్డి ప్రభుత్వం లాంటి పదాలను వాడటం వల్ల వికలాంగుల మనోస్థైర్యం దెబ్బతింటోందని, వారు తీవ్ర మనస్థాపం చెందుతూ తమకు ఈ మేరకు విజ్ఞప్తి చేశారని చెప్పారు. ఎన్నికల నిబంధనల ప్రకారం కూడా ఇతరులను కించపరిచే పదాలను ప్రచారంలో వాడకూడదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్లో బుధవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ , ఓటర్ల జాబితా సవరణ గురించి ముందుగా వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 10వేల కొత్త ఓటర్లను చేర్చామన్నారు. కొత్త ఓటర్లు ఓటు కోసం ధరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 14వరకు అవకాశం ఉందన్నారు. ఇప్పుడు కేవలం ఓట్ల చేర్పింపు మాత్రమే జరుగుతుందని, మిగిలిన వాటికి అవకాశం లేదని తెలిపారు. 18 ఏళ్లలోపు బాల బాలికలను రాజకీయ కార్యకలాపాల్లో వినియోగించకూడదని చెప్పారు. పార్టీల ప్రచారం, పాంప్లెట్లు, జెండాల పంపిణీ, ర్యాలీలు, నినాదాలు ఇవ్వడంతోపాటు, రాజకీయ పార్టీలు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పిల్లలను వినియోగించ కూడదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు చేసే వ్యయం అంతా పార్టీ ఖాతాలోకి వెళ్తుందని, నామినేషన్ దాఖలు చేసిన తరువాత అభ్యర్థి ఖాతాలో లెక్కిస్తారని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, వివిధ నియోజకవర్గాల ఆర్ఒలు, నోడల్ ఆఫీసర్లు, తాహశీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కె.నాగలక్ష్మి

ఏ సమస్య వచ్చినా నేనున్నాను

- వైసిపి విస్తృత సమావేశంలో బొత్స
- కష్టపడి పని చేయాలని పిలుపు

ప్రజాశక్తి - జామి

చిన్న చిన్న పొరపచ్చాలు వీడి కలిసికట్టుగా పనిచేసి వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపి అభ్యర్థులను గెలిపించుకోవాలని మంత్రి బొత్స సత్యన్నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కుమరాం గ్రామంలో ఆ పార్టీ మండల కన్వీనర్ జి. రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కేడర్‌కు పలు సూచనలు చేశారు. గత పాతికేళ్ళుగా ఎస్. కోట నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలకు అండగా ఉన్నామని, ఇప్పటి నుంచి మరింత బాధ్యతగా ఉండి, సేవ చేస్తానని హామీ ఇచ్చారు. వెళ్లిపోయిన వారిని పట్టించుకోవద్దని అన్నారు. మీమండలం, మీ గ్రామాల్లో మీకున్న గౌరవానికి, విలువకు ఏమాత్రం డోకా లేకుండా చూసుకునే బాధ్యత నాదేనని, ఇప్పటి వరకు మీతో ఉన్న అనుభందం కన్నా మరింత అనుభందం పెరిగిందని అన్నారు. ఎస్.కోటలో ఎమ్మెల్యే గెలిస్తే ఎంపి కూడా గెలుస్తారని, ఇది చరిత్ర చెబుతోందని గుర్తు చేసారు. మీకు ఏకష్టం వచ్చినా స్థానిక ఎమ్మెల్యే, ఎంపితోపాటు తానుకూడా ఉన్నానని భరోసా ఇచ్చారు. భీమసింగి చక్కెర కర్మాగారం స్థానంలో మరో పరిశ్రమను ఏర్పాటు చేస్తామని, వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కలిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందంటే అది తమ హాయాంలోనేనని గుర్తించాలన్నారు. సమావేశంలో ఎస్‌కోట పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్, గిరిజన కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభాస్వాతీరాణి, జెడ్‌పిటిసి గొర్లె సరయు, సీనియర్ నాయకులు పి.సంజీవి, చలుమూరు సత్యారావు, అల్లు పద్మ, గేదెల వెంకటరావు,ఎన్నింటి విజయలక్ష్మి, మండల యువజన విభాగం అధ్యక్షుడు పిన్నింటి రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ

తీరానికి చేరుకున్న మత్స్యకారులు

- ఊపిరి పీల్చుకున్న కుటుంబ సభ్యులు, అధికారులు

ప్రజాశక్తి -భోగాపురం

విశాఖ తీరంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభ్యమయింది. వారంతా బోల్తాపడిన తెప్పపైనే ఎక్కి అప్పికొండ బీచ్ వద్దకు చేరుకోవడంతో అధికారులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ముక్కాం గ్రామానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు సోమవారం వేటకు వెళ్లి మంగళవారం సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో వాళ్ల కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వారి ఫిర్యాదు మేరకు కోస్ట్ గార్డ్ పోలీసుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇంతలో బుధవారం వేకువ జామున అప్పికొండ తీరం వద్దకు ఈదుకుంటూ వారంతా చేరుకున్నారు. అక్కడ స్థానికులు వారిని చేర దీశారు. ఈసందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ సముద్రంలో అలల తాకిడికి తెప్ప బోల్తా పడినట్లు తెలిపారు. బోల్తా పడిన తెప్పను యథాస్థితికి తెచ్చేందుకు ప్రయత్నించగా కుదరలేదని, దీంతో వలలు దాచుకునే కవర్ సహాయంతో తీరానికి చేరుకున్నట్లు వీరు తెలిపారు. వీరిని గ్రామ సర్పంచ్ భర్త వాసుపల్లి రెయ్యుడు పరామర్శించారు. ఈ సంఘటనలో ప్రాణాలతో ఒడ్డికి చేరుకున్నప్పటికీ తెప్పతో పాటు విలువైన వలలు పోయాయని తెప్ప యజమాని తెలిపారు. సుమారు 5 లక్షలు నష్టం వాటిల్లినట్లు మత్స్యకారులు చెబుతున్నారు.



సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు వీరే

ఎమ్‌పి, ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-గజపతినగరం

విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బొత్సఅప్పలనర్సయ్య బుధవారం గజపతినగరం, పురిటిపెట పంచాయతీల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. వైసిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ తమను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తమ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందించిందని వివరించారు. గజపతినగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని చెప్పారు. బడుగు, బలహీనవర్గాలకు మేలు జరగాలి అంటే మళ్లీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని అన్నారు. కార్యక్రమంలో పురిటిపెంట మాజీసర్పంచ్ మండల సురేష్, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, జెడ్‌పిటిసి సభ్యులు గారతవుడు, నాయకులు బెల్లాన త్రినాథరావు, యువ నాయకులు బొత్స సాయి గురునాయుడు తదితరులు ఉన్నారు.



డాక్టర్ కృష్ణారావును ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

అవకాశవాదులను చెత్తబుట్టలో వేయండి

- పార్టీ గెలుపునకు కృషి చేయండి
- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు
- మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్ సహా పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిక్కెట్ వస్తే ఒకలా..రాకపోతే మరోలా వ్యవహరిస్తున్న అవకాశవాదులను చెత్తబుట్టలో వేసి పార్టీ అభ్యర్థుల గెలుపునకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. గజపతినగరం నియోజకవర్గానికి చెందిన జెడ్‌పిటిసి మాజీసభ్యులు మక్కువ శ్రీధర్, కొణిశ గ్రామ సర్పంచ్ శీరంరెడ్డి రామ్‌కుమార్, శారదానాయుడు, సర్పంచ్‌లు అనూష, సూరెడ్డి రామలక్ష్మి, సహా పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, వందల మంది కార్యకర్తలు బుధవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో అశోక్‌గజపతిరాజు, గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పివి గోపాలరాజు అధ్యక్షతన జరిగిన సభలో అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేసిందన్నారు. ఐదేళ్ల పాలనలో ఉత్తరాంధ్ర జిల్లాల సుజల స్రవంతి ఏమైందని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన విద్యాశాఖా మంత్రి రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యేందుకు కారకులయ్యారని విమర్శించారు. ఐటి సెక్టార్ పక్క రాష్ట్రాలకు తరలి పోతోందని, ఈ ఐదేళ్లలో ఒక్క కంపెనీ కూడా రాలేదని అన్నారు. రాష్ట్రంలో దొంగలను శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పల నాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని 34 అసెంబ్లీ స్థానాల్లోనూ టిడిపి గెలుస్తుందన్నారు. పార్టీ ఎంతో నమ్మకంతో తనకు ఎంపి టిక్కెట్ ఇచ్చిందని, అందరూ సహకరించి గెలిపించాలని కోరారు. గజపతినగరం అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పెద్దఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు చేరడంతో పార్టీ బలం మరింత పెరిగిందన్నారు. కంచుకోటైన జిల్లాలో మళ్లీ టిడిపి జెండా ఎగురవేయాలని కోరారు. మక్కువ శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబ సభ్యులను బలిపెట్టి ప్రత్యర్థులు గెలవాలను కుంటున్నారని అన్నారు. గత 20ఏళ్లగా మండల ప్రజలు తనను నమ్ముకుంటూ వస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కోసం పనిచేస్తానని తెలిపారు. అందరం కలిసికట్టుగా పనిచేసి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తెలిపారు. ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ టిడిపికి కంచుకోట అయిన విజయనగరం జిల్లాలో అన్ని సీట్లను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, మండల అద్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, గంట్యాడ మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, నాయకులు చప్పా చంద్రశేఖర్, రుంకాన అరుణ, గుంట్రోతు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా పార్టీ కార్యాలయానికి వెళ్తున్న గజపతినగరం టిడిపి నాయకులు, కార్యకర్తలు



మక్కువ శ్రీధర్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌గజపతిరాజు


రికార్డులను తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలో ఉన్న ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎలక్ట్రానిక్ హెల్త్ రిజిస్టర్‌ను పరిశీలించి ఒపికి ఎంతమంది వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కింద పిహెచ్‌సిలో ఎన్ని రిజిస్టరులు జరిగాయో, లక్ష్యాలను ఎంతవరకు అధిగమించారో అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది వంద ప్రసవాలు జరగాల్సి ఉండగా ఇప్పటివరకు 70 ప్రసవాలు పూర్తి చేసినట్టు వైద్యాధికారి రత్నదీప్ తెలిపారు. పిహెచ్‌సిలో ఉన్న మందులు, ఇతర సమస్యలపై ఆయన ఆరా తీశారు. నిబంధనల మేరకు సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు సత్వర సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కిషోర్, సుజాత పాల్గొన్నారు.

బస్‌స్టేషన్‌లో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్థానిక ఆర్‌టిసి బస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కె. రమేష్ బుధవారం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన దాత స్థానిక చిత్రకళా స్టూడియో రాజుతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

100 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - బాడంగి

మండలంలోని ఆనవారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ దగ్గర నుండి 100 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ జయంతి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఆనవారం వెళ్లే మార్గంలో సిబ్బంది కాపు కాసి మార్గం మధ్యలో ద్విచక్ర వాహనంతో పాటు అతన్ని పట్టుకున్నామన్నారు.

ఓటుహక్కును అమ్ముకోవద్దు

ప్రజాశక్తి - బొబ్బిలి


ఓటు అమ్ముకోవద్దని కోరుతున్న యువత

ఓటుహక్కును అమ్ముకోవద్దని వనమిత్ర అధ్యక్షులు కె.కృష్ణదాసు కోరారు. ఓటుహక్కు ప్రాముఖ్యతపై యువతకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కును యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా పని చేసే అభ్యర్థులకు ఓటు వేసి ఎన్నుకోవాలని కోరారు. ఓటుహక్కుతో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.


సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న కోళ్ల లలితకుమారి

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - జామి

సమస్యల పరిస్కారమే లక్ష్యాంగా పని చేస్తానని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని తానవరం, పావాడ, లక్ష్మిపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి టిడిపి హామీయిలను వివరించారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిస్కారానికి, ఫ్యాక్టరిని కాపాడుకోవడానికి కృషి చేస్తాన్నారు. కార్యక్రమంలో వర్రీ రమణ, జనసేన నాయకులు సత్తిబాబు, వర్మ రాజు, బండారు పెదబాబు, వర్రీ రమణ, కొమ్మునేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఖడ్గవలస జంక్షన్లో మంగళవారం అర్ధరాత్రి ఎస్ఐ వె.అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నగదు, మద్యం, నాటుసారా అక్రమ రవాణా జరగకుండా తనిఖీ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొ న్నారు.

సీతంపేటలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి -సీతంపేట

సీతంపేట గ్రామంలో ఎస్ఐ ఎం.జగదీశ్ నాయుడు ఆధ్వర్యాన సిబ్బంది, కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని ఆయన తెలిపారు.


రేగిడి: ఓటు హక్కుపై వివరిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

ఓటు విలువ తెలుసుకోవాలి

ప్రజాశక్తి - రేగిడి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓటర్లు ఓటు విలువను తెలుసుకోవాలని ఎస్ఐ ఈ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం వావిలవలస గ్రామంలో ఎన్నికలలో శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలింగ్ బూతుల వద్ద ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. ఓటే వజ్రాయుధంగా భావించి ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించాలని కోరారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

తగాదాలకు పోవద్దు

వంగర: సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ఎవరూ తగాదాలకు పోకుండా గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ప్రజలు స్నేహిపూర్వకంగా మెలగాలని ఎస్ఐ వైవి జనార్ధన అన్నారు. ఈ మేరకు మండలంలోని కోనంగిపాడులో ఆయన బుధవారం పర్యటించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


వంగర: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ జనార్ధన

అపెరల్ పార్కు ఏదీ?

- టిడిపి హయాంలో శంకుస్థాపన
- వైసిపి ప్రభుత్వంలో ఊసే లేదు
- పార్కు స్థలంలో జగనన్న కాలనీ

ప్రజాశక్తి-రేగిడి

రాజాం నియోజకవర్గంలోని రేగిడి మండలం గుల్లపాడు గ్రామపంచాయతీ పరిధి కొండల మామిడి వలస (ఉంగరాడమెట్ట) వద్ద అపెరల్ పార్కు (టెక్స్‌టైల్ పరిశ్రమ) ఏర్పాటుకు వేసిన శిలాఫలకం నిరుద్యోగులను వెక్కిరిస్తోంది. అపెరల్ పార్కు నిర్మాణం కోసం అప్పటి టిడిపికి చెందిన రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి, ప్రస్తుత స్పీకర్ తమ్మినేని సీతారాం 2000 సంవత్సరంలో శిలాఫలకం వేశారు. ఆగమేఘాలపై రెవెన్యూ అధికారులు 10ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించి నివేదికలు పంపించాలని ఆదేశాలు కూడా ఇచ్చారు. రెవెన్యూ అధికారులు సర్వేలు చేసి ప్రజా ఆమోదం తీసుకున్నారు. ఇక్కడ అపెరల్ పార్కు నిర్మాణం చేపడితే వేలాది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కలుగుతుందని అప్పటి టిడిపి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మంత్రి తమ్మినేని సీతారాం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీని గాలికి వదిలేశారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఆ పరిశ్రమ ఊసే ఎత్తలేదు. పైగా ఈ స్థలాన్ని జగనన్న కాలనీకి రెవెన్యూ అధికారులు బదిలీ చేశారు. దీంతో అపెరల్ పార్కు నిర్మాణం లేక వేలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కరువైంది. దీంతో విశాఖ, చెన్నై, ముంబై, కోల్‌కత్తా, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో పనులు కోసం వలస వెళ్లిపోతున్నారు. ప్రభుత్వాలు మారిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు.


ఇదే అపెరల్ పార్కు నిర్మాణానికి కేటాయించిన స్థలం

ఉపాధి కోసం ఎదురుచూపులు

రాజాం నియోజకవర్గంలో రేగిడి, సంతకవిటి, వంగర, రాజాం మండలాల్లో 120 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాలకు చెందిన వందలాది మంది యువకులు ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా ఉన్నారు. ఇక్కడ టెక్స్‌టైల్స్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఉపాధి పొందిన కుటుంబాలకు చేదోడువాదోడిగా ఉంటామను కున్న నిరుద్యోగుల ఆశలు అడియాశలయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి అపెరల్ పార్కు నిర్మాణం కోసం నిధులు కేటాయించి నిరుద్యోగ సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.


పార్కు కోసం కేటాయించిన స్థలంలో జగన్ కాలనీ నిర్మాణం

ఉపాధి లేక వలసలు



ఉన్నత చదువులు చదివినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం రాక, ఉపాధి లేక వలస బాట పడుతున్నాం. ఇక్కడ అపెరల్ పార్కు నిర్మాణం చేపడితే నిరుద్యోగ సమస్య కొంతయినా తీరుతుంది. ఉపాధి కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

వాల్తేటి రవికుమార్, కొమిరి గ్రామం

ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు



కొండల మామిడి వలస సమీపాన ప్రభుత్వ స్థలంలో టెక్స్‌టైల్స్ పరిశ్రమ నిర్మాణం కోసం అప్పటి టిడిపి ప్రభుత్వం శంకుస్థాపనచేసి 24 ఏళ్లయ్యింది. ఆ తరువాత వైసిపి అధికారం చేపట్టినప్పటికీ పట్టించుకోలేదు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులకు శ్రద్ధ లేదు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుంది. మా గ్రామం సమీపంలో కొత్త పరిశ్రమ వస్తే చదువుకున్న తమకు ఉద్యోగవకాశాలు వస్తాయని ఆశపడ్డాం. కానీ మా ఆశ నెరవేరలేదు. వచ్చే కొత్త ప్రభుత్వమైనా అపెరల్ పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

చింతాడ గణేష్, రేగిడి

మిమ్స్ ఉద్యోగుల అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి - బొబ్బిలి

మిమ్స్ ఉద్యోగులు, కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల అక్రమ అరెస్టులకు నిరసనగా పట్టణంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని 62 రోజులుగా ఆందోళన చేస్తే యాజమాన్యం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మిమ్స్ యాజమాన్యం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచేందుకు ఆరేళ్ల నుంచి వేతన ఒప్పందం చేయకుండా తాత్సారం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు కలుగజేసుకుని వేతన ఒప్పందం చేయాల్సి ఉన్నప్పటికీ చేయడం లేదన్నారు. వైద్య రంగంలో కోట్లాది రూపాయలు లాభాలు ఆర్జిస్తున్న యాజమాన్యం కార్మికులు, ఉద్యోగులకు ఎందుకు వేతనాలు పెంచడం లేదని ప్రశ్నించారు.

సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకోలు


బొబ్బిలి: నిరసన తెలుపుతున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

రామభద్రపురం: అర్ధాకలితో అలమటిస్తున్న మిమ్స్ కార్మికుల అక్రమ అరెస్టులు అన్యాయమని సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ తక్షణమే కార్మికులకు వేతన ఒప్పందం చేసి జీతాలు పెంచాలని, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. 2011 నుండి 2020 ఏప్రిల్ వరకు ప్రభుత్వం ప్రకటించిన డిఎను ఉద్యోగులందరికీ చట్టప్రకారం చెల్లించాల్సి ఉన్నప్పటికీ 2020 అక్టోబర్ నుండి నేటి వరకు డిఎలను ఏ ఒక్కరికీ చెల్లించలేదని, వీటిని ఎరియర్స్‌తో పాటు చెల్లించి వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సస్పెన్షన్ల, బదిలీలు నిలిపివేసి యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, జనార్ధన, నాగరాజు పాల్గొన్నారు.


రామభద్రపురం: మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తెర్లాం: నెల్లిమర్ల మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల అక్రమ అరెస్టుపై మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి గోపాలం మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వేతనం అమలు చేయాలని తమ న్యాయమైన డిమాండ్ల కోసం గత 62 రోజులుగా ఆందోళన చేస్తున్న యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. వైద్యరంగంలో కోట్లాది రూపాయలు లాభాలు అర్జిస్తున్న కార్మికులకు ఒక్క రూపాయి కూడా వేతనం పెంచకపోవడం దురదృష్టకరమన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు, సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.


తెర్లాం: నిరసన తెలుపుతున్న కార్మికులు


మాట్లాడుతున్న తహశీల్దార్ సులోచనారాణి

పింఛన్లు పంపిణీ చేయండి

ప్రజాశక్తి - రామభద్రపురం

పింఛన్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలని తహశీల్దార్ సులోచనారాణి ఆదేశించారు. తన కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ ఈశ్వరమ్మతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఇంటింటా వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం అనుమతులు ఇవ్వలేదని, గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సక్రమంగా పింఛన్లు పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సమయ పాలన పాటించి సత్వర పంపిణీకి సిద్ధం కావాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా పించన్ దారులకు ఇబ్బందులు కలగకుండా నీడ ఏర్పాట్లు చేస్తూ, తాగునీరు సదుపాయం అందుబాటులో ఉంచాలన్నారు. వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛను సొమ్ము అందించాలన్నారు.

మరికొద్ది రోజుల్లో వైసిపి కనుమరుగు : కోండ్రు

ప్రజాశక్తి - వంగర

మరికొద్ది రోజుల్లో వైసిపి కనుమరుగవుతుందని రాజాం నియోజకవర్గం టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని నీలయ్యవలస, పట్టువర్ధనం, భాగంపేట శ్రీహరిపురం, శ్రీహరిపురం ఆర్ఆర్ కాలనీ గ్రామాలలో ఆయన బుధవారం పర్యటించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు రూపకల్పన చేసిన సూపర్ సిక్స్, బీసీ డిక్లరేషన్‌లపై ప్రజలకు వివరించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్ మోహన్ రెడ్డి రద్దు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహనరావు, లచ్చు బుక్త కృష్ణమూర్తి, ఉదయాన మురళీ, కృష్ణారావు, మజ్జిగ గణపతి, గంగులు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో బుధవారం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రంగు కృష్ణారావు, కర్రి రమణ, నారు జనార్ధనరావు, దూబ ధర్మారావు, రమేష్ నాయుడు, నారాయణరావు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.


వంగర: మహిళతో మాట్లాడుతున్న కోండ్రు మురళి

పింఛన్ల పై వైసిపి దుష్ప్రచారం మానుకోవాలి

రాజాం: పింఛన్లపై వైసిపి దుష్ప్రచారం మానుకోవాలని మాజీ మంత్రి, రాజాం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్‌రావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన బుధవారం జనసేన, బిజెపి నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం కనీసం రాజాం రోడ్లు మరమ్మత్తులు చెయ్యలేని అసమర్థంగా ఉందన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో ఫించన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధులు కొరతే కారణమన్నారు. ఎన్నికల కమిషన్, టిడిపిపై వైసిపి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఏప్రిల్ 1వ తారీఖు నుంచి ఇంటి వద్దే ఫించన్లు పంపిణీ చేయాలని సీఎం జగన్ ఎందుకు ఆదేశాలు జారీ చెయ్యలేక పోయారని ప్రశ్నించారు. 1.35 లక్షల సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధప్రాతిపదికన ఫించన్లు ఇంటి వద్దే పంపిణీ చేయడం రెండు గంటల్లోనే సాధ్యం అవుతుందన్నారు. అధికారులతో సచివాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేయిస్తే తామే టెంట్లు, మజ్జిగ ఏర్పాటు చేస్తామన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే రూ.4వేలు పింఛను ఇంటి వద్దనే ఇస్తామన్నారు. బిజెపి నాయకులు కోటగిరి నారాయణ రావు, జనసేన నాయకులు ఉర్లాపు పోలిరాజు, గురవాన నారాయణ రావు, రఘుమండల గణపతి, పాలవలస సింహాచలం, జొన్నాడ రంజిత్, మిత్తి రెడ్డి మధుసూదన రావు, రమణ తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న తేజారాణి

బిఎస్‌పి అభ్యర్థిగా పోటీ చేస్తా : తేజారాణి


ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గం బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని ఎరుకొండ తేజారాణి తెలిపారు. బుధవారం ఆమె రామతీర్థ కూడలిలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బహుజన సమాజ్ పార్టీ తరుపున పోటీ చేస్తానని తెలిపారు. దీనిలో భాగంగా అంబేద్కర్ ఆశీస్సులు తనపై ఉండాలని ముందుగా ఆయనకు పూలమాల వేసి ప్రచారాన్ని ప్రారంభిస్తున్నాని చెప్పారు. అనంతరం బిఎస్‌పి నియోజకవర్గం అధ్యక్షుడు ఎరుకొండ వెంకటరావు మాట్లాడుతూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ బహుజనలు బిజెపికి మద్దతు తెలుపుతున్న టిడిపి, జనసేన, వైసిపిలకు ఓటువేస్తే నష్టపోతామన్నారు. ఒక సాధారణ కుంటుంబం నుంచి వచ్చిన యువకిరణం ఎరుకొండ తేజారాణికి ఏనుగు గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

వైసిపితోనే సంక్షేమం : ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వైసిపి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమవుతోందని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని పేరాపురం, పూసపాటిపాలెం, గొల్లపేటలో తొమ్మిదో రోజు వైసిపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందించే ఈ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. మరోసారి నెల్లిమర్ల వైసిపి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ని ఆశీర్వదించాలన్నారు. వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలంటే ఈ ప్రభుత్వం మరలా రావాలన్నారు. ప్రచారంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, పేరాపురం సర్పంచ్ రౌతు శ్రీరామూర్తి, నాయకులు మహంతి జనార్ధనరావు, పుప్పాల లక్ష్మినారాయణ, దేశెట్టి గణేష్, పట్టెపు శ్రీనివాసరావు, యడ్ల రామకృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


పూసపాటిరేగ : పథకాల గురించి వృద్ధురాలికి చెబుతున్న ఎమ్మెల్యే

బొత్స ఎన్నికల ప్రచారం

గజపతినగరం: మండలంలోని పురిటిపెంటలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య బుధవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బడుగు బలహీన వర్గాలకు మేలు జరగాలంటే సంక్షేమ పథకాలు మరల కొనసాగాలని దానికి అధికారంలో వైసిపి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు బొత్స సాయిగురునాయుడు, జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, వైసిపి మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


గజపతినగరం: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బొత్స


అవగాహన కల్పిస్తున్న ఉమాశంకర్

తాగునీటి సమస్య రాకూడదు

ప్రజాశక్తి - విజయనగరం

నీటిని పొదుపుగా వాడటం ద్వారా భావితరాలకు తాగునీటి సమస్య రాకుండా చూడా లని జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్య వేక్షక ఇంజినీరు పి. ఉమాశంకర్ అన్నారు. బుధ వారం ఎంఆర్ కళాశాలలో విద్యార్థులకు ఇంటర్నె షిప్‌లో భాగంగా జరిగిన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాగునీటి నాణ్యత పరీక్షా విధానం, సురక్షితమైన తాగునీరు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ ఎవి. మురళీ మోహన్‌రావు, ఎఇ ఎస్.దుర్గాభవానీ, జిల్లా వాటర్ క్వాలిటీ కన్సల్టెంట్ అప్పలరాజు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం

ప్రజాశక్తి - గజపతినగరం

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని భూదేవి పేటలోని క్లస్టర్ ఇంచార్జ్ డాకి నారాయణప్పలనాయుడు ఆధ్వర్యంలో బుధవారం టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం జరిగిందని, టిడిపి ప్రభుత్వంలో బిసి కార్పొరేషన్ ద్వారా చేతివృత్తి, వ్యాపారం చేసుకుంటున్న బిసిలకు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్స్ ఇచ్చేవారని, జగన్ రెడ్డి ఆదరణ లాంటి 30 పథకాలు రద్దు చేశారని గుర్తు చేశారు. జగన్ రెడ్డి రద్దు చేసిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు పునరుద్ధరిస్తామని, శాశ్వత కుల ధృవీకరణపత్రాలు అందజేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి, మండల నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జిలు, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

ఘనంగా వేమాలమ్మ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - వేపాడ

మండలం బాణాది పంచాయతీ పరిధిలో గల ఎం.సింగవరం గ్రామంలో దాతలు, గ్రామస్తులు సహకారంతో నిర్మించిన వేమాలమ్మ ఆలయం విగ్రహం ప్రతిష్ట బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాల్లో ఎంపిటిసి గొంప తులసి, గ్రామ సర్పంచ్ కర్రీ యశోద, గ్రామ పెద్దలు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


పూర్ణకుంభాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు